క్లుప్తంగా

రేపటి నుంచి బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని బీరప్ప ఆలయంలో శ్రీమహంకాళి బీరప్ప నందీశ్వర సింహ వాహన పోతురాజు భోగన్న నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఈనెల 22 (శనివారం) నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. ఈనెల 22,23వ తేదీల్లో వేదపండితులు శివ కిరణ్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు, హోమాలు, అన్నదానాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నిధులు కేటాయించాలి

వేలేరు : నూతనంగా ఏర్పడిన వేలేరు మండల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరినట్లు మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ తెలిపారు. గురువారం స్టేషన్ ఘన్‌పూర్‌లో జరిగిన ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కడియం దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన మౌటం కుమారస్వామి ఇంట్లో నిల్వ చేసిన 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై వీరభద్రరావు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కుమారస్వామి తన ఇంటి వద్ద రేషన్ బియ్యం నిల్వ చేసి ఉంచాడనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో రూ.19,500 విలువ చేసే 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించినట్లు తెలిపారు. ఆ బియ్యాన్ని సీజ్ చేసి కుమారస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డబ్బుల కోసం డప్పుల మోత



కాజీపేట అర్బన్: హనుమకొండ నక్కలగుట్టలోని అక్షర చిట్‌ఫండ్స్ కార్యాలయం ఎదుట అక్షర టౌన్‌షిప్, అక్షర చిట్స్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో బాధితులు డప్పులు కొడుతూ గురువారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అక్షర చిట్స్ కార్యాలయం ఎదుట ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సుమారు 50 మంది బాధితులు ఈనెల 15వ తేదీ నుంచి నిరసన తెలుపుతూ గురువారం డప్పుల మోతతో అక్షర చిట్స్ యజమాని పేరాల శ్రీనివాసరావు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఘటన స్థలానికి సుబేదారి పోలీసులు చేరుకుని ఆందోళనను విరమింపజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన రమాదేవి మాట్లాడుతూ తన భర్త ఎల్ఐసీ డబ్బులు రూ.30లక్షలను రెండున్నర ఏళ్ల క్రితం ఎఫ్‌డీ చేశానని, ఇప్పుడు తన కూతురు వివాహం పెట్టుకున్నానని, ఈక్రమంలో తన డబ్బులు తనకు ఇప్పించాలని వేడుకున్నారు.

పరీక్షలు అంటే భయం వీడాలి

ఖిలా వరంగల్: పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయం వీడి ఆత్మవిశ్వాసంతో రాయాలని సైకాలజిస్ట్ డాక్టర్ బరుపాటి గోపి సూచించారు. వరంగల్ శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర స్వామి అధ్యక్షతన పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు గురువారం మోటివేషనల్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష పత్రం పూర్తిగా చదివిన తర్వాత తెలిసిన ప్రశ్నలకు ముందుగా జవాబులు రాయాలని అన్నారు. ఉపాధ్యాయులు తిరుపతి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, దేవరాజు, అంజయ్య, నరేందర్ పాల్గొన్నారు.

కొనుగోలు పరిమితులు పెంచాలి

వరంగల్: కొలుగోలు విషయంలో 6 క్వింటాల పరిమితిని తెలంగాణ ప్రభుత్వం విధించడం వల్ల ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల కంది దిగుబడి వచ్చిన రైతులు అనేక ఇబ్బందులతోపాటు నష్టపోతున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ చందర్‌రావు, చేర్యాల పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఉడుముల బాల్‌రెడ్డి తెలిపారు. ఈక్రమంలో పరిమితులను పెంచాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. రైతుల ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు.

వాహనాల వేలానికి స్పందన

కాజీపేట అర్బన్: హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన పలు వాహనాలకు గురువారం నిర్వహించిన వేలంపాటలో స్పందన వచ్చిందని హనుమకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.దుర్గాభవాని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు వాహనాలకు రూ.63 వేలకు వేలంపాట నిర్ణయించగా, వాహనాలను కొనుగోలు చేసేందుకు పలువురు పోటీపడి రూ.1.54 లక్షలకు దక్కించుకున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు పాల్గొన్నారు.

పన్నుల వసూలు అంతంతే!



ఐనవోలు గ్రామ పంచాయతీ కార్యాలయం



పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ

- గ్రామాల్లో మొండి బకాయిలు
- వందశాతం వసూలు చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు
- సహకరించని ప్రజలు
- మార్చి లోపు పూర్తయ్యేనా?

ఐనవోలు : ఇంటిపన్ను, నీటి పన్నుతో పాటు ఇతర పన్నులను ప్రజలు సకాలంలో చెల్లిస్తేనే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందే ఆస్కారం ఉంటుంది. ప్రజల నుంచి వచ్చిన పన్నులకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు తోడైతేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. గ్రామాల్లో పేరుకుపోయిన ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలని ప్రభుత్వం పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ గ్రామాల్లో మొండి బకాయిలు అధికంగా పేరుకుపోతున్నాయి. దీంతో కారోబార్లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో తిరుగుతూ పన్నులు వసూలుపై దృష్టి పెడుతున్నారు. అయినా అనుకున్న మేర వసూలు కావడం లేదని అధికారులు అంటున్నారు. వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని సంబంధితశాఖ అధికారులు మండలస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నా ప్రజలు మాత్రం పన్నులు చెల్లింపులో జాప్యం చేస్తున్నారని క్షేత్రస్థాయి అధికారులు తెలిపారు.

మార్చిలోపు వసూలయ్యేనా..



ఇంటి పన్ను వసూలు చేసి రశీదు అందిస్తున్న పంచాయతీ అధికారి

సాధారణంగా ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన నాలుగు నెలల్లోనే వందశాతం పన్నులు వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ సాధ్యం కాకపోవడంతో మార్చి నెలాఖరు వరకు ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది. ఇప్పటి వరకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కొన్ని చోట్ల పంచాయతీ అధికారులు పన్నులు వసూలు చేసేందుకు శ్రమిస్తున్నప్పటికీ మరి కొన్ని చోట్ల నామమాత్రంగానే వసూలు చేస్తున్నట్లు తెలిసింది. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించి వందశాతం పన్ను వసూలుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

> **లక్ష్యాన్ని చేరుకుంటాం..**
>
> వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. మండలంలో ఇప్పటి వరకు సుమారు 70 శాతానికి పైగా ఆన్‌లైన్ పన్నులు వసూలు చేశాం. ప్రజలు సహకరిస్తే మార్చి 31 లోపు అన్ని గ్రామాల్లో 100 శాతం పన్నులు వసూలు అయ్యే అవకాశం ఉంది.
>
> \- పులి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ, ఐనవోలు

ఇదీ పరిస్థితి..

మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో పన్నుల డిమాండ్ రూ. 46,92,905 ఉంది. ఇప్పటి వరకు ఆఫ్‌లైన్‌లో రూ. 38,63,168 వసూలు కాగా ఇంకా రూ. 8,29,737 వసూలు కావాల్సి ఉంది. రెండు చిన్న గ్రామపంచాయతీల్లోనే 100 శాతం పన్నులు వసూలు కాగా ఇంకా 15 జీపీల్లో లక్ష్యం చేరుకోవాల్సి ఉంది. నందనం, కక్కిరాలపల్లి, పెరుమాండ్లగూడెం, వనమాల కనపర్తి, గర్మిళ్లపల్లి, కొండపర్తి, ఒంటిమామిడిపల్లి, పున్నేలు తదితర మేజర్ గ్రామ పంచాయతీల్లో 70-75 శాతం మాత్రమే పన్నులు వసూలు అయినట్లు అధికారులు తెలిపారు.

రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

వర్ధన్నపేట: రుణమాఫీ అయిన రైతులకు తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బ్యాంకు అధికారులను ఆదేశించారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల ఖాతాలు మెరుగుపరిచి వారికి మాఫీ అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. వర్ధన్నపేట డీసీసీబీ కార్యాలయంలో వర్ధన్నపేట, రాయపర్తి, నందనం, ఐనవోలు సొసైటీలు, ఐనవోలు, వర్ధన్నపేట డీసీసీబీల మేనేజర్లు, నోడల్ అధికారులు, సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల ద్వారా ఇచ్చిన రుణాలను లీగల్‌గా కవర్ చేసి రికవరీ చేయాలన్నారు. బ్యాంకు లక్ష్యాలను వంద శాతం పూర్తిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిపాజిట్లు, బంగారు ఆభరణాల రుణాలపై దృష్టిసారిస్తూ బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని చైర్మన్ రవీందర్‌రావు కోరారు. నోడల్ అధికారి ఏజీఎం ప్రవంతి, బ్రాంచ్ మేనేజర్లు సమత, శ్రావణ్, భద్రునాయక్, పాక్స్ చైర్మన్ రాజేశ్‌ఖన్నా, రామచంద్రారెడ్డి, సొసైటీ సీఈఓలు యాదగిరి, సంపత్, సోమయ్య, సిబ్బంది సురేశ్, సమ్మయ్య, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న మార్నేని రవీందర్‌రావు

బొలెరో వాహనాన్ని ఢీకొట్టిన బొగ్గు లారీ



బొగ్గు లారీ ఢీకొట్టడంతో ధ్వంసమైన బొలెరో వాహనం వెనుక భాగం

కమలాపూర్ : బొలెరో వాహనాన్ని బొగ్గు లారీ ఢీకొట్టిన ఘటనలో బొలెరో వాహనం వెనుక భాగం ధ్వంసం కాగా అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు మహిళలు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటన కమలాపూర్ బస్టాండ్ వద్ద గురువారం చోటుచేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొండమీది రవి (టీఎస్ 03 ఈటీ 5990) నంబరు గల తన బొలెరో వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి ఉప్పల్ వైపు ఉన్న ఉమామహేశ్వర ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న ఫంక్షన్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్థానిక బస్టాండ్ వద్ద వెనుక నుంచి వస్తున్న (టీజీ 12టీ 3939) నంబరు గల బొగ్గులారీతో డ్రైవర్ అతివేగంగా వచ్చి వెనుక నుంచి బొలెరో వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం వెనుక భాగం పూర్తిగా ధ్వంసమై అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు మహిళలకు స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

శాయంపేట : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరకాల సీడీపీఓ స్వాతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 6 సంవత్సరాల నుంచి 3 సంవత్సరాల పిల్లలకు ట్రాకర్‌లో ఫొటో క్యాప్చర్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లల ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింక్ చేయాలని, పోషన్ ట్రాకర్‌లో ఫొటో క్యాప్చర్ తీయడం ద్వారానే బాలామృతం వస్తుందని తెలిపారు. అంగన్‌వాడీలో ఉన్న పిల్లల ఎత్తు, బరువులను సరిగా చూడాలని, పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతా, ట్రాకర్ పోషన్‌అధికారి భిక్షపతి, అంగన్‌వాడీ టీచర్ రత్నమాల, చిన్నారులు పాల్గొన్నారు.



చిన్నారుల వివరాలు రాసుకుంటున్న సీడీపీఓ స్వాతి

ఉపాధ్యాయుల పక్షాన పోరాడే వ్యక్తినే గెలిపించాలి

వేలేరు : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు, పేద ప్రజల పక్షాన పోరాడే వ్యక్తి పులి సరోత్తంరెడ్డిని గెలిపించాలని మాజీమంత్రి డాక్టర్ గుండె.విజయ రామరావు కోరారు. గురువారం మండలంలోని పలు పాఠశాలల్లో ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై సరోత్తంరెడ్డి ఎన్నోఏళ్లుగా పోరాటం చేస్తున్నాడని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదని, బీజేపీ బలపరిచిన అభ్యర్థి సరోత్తంరెడ్డిని గెలిపిస్తే శాసనమండలిలో ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసి వాటి పరిష్కారానికి కృషి చేస్తాడని అన్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకటేశ్వర్లు, బీజేపీ మండల అధ్యక్షుడు రాజు, బీజేపీ నాయకులు కీర్తి సురేశ్, కోటి, శివాజీ, శ్రీనివాస్, కిరణ్, ప్రశాంత్, రాజు, రఘురామ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరకాల : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారించేందుకు బీజేపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డి పోరాడుతారని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మేకల రాజవీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ అధ్యక్షతన ఓటర్స్ సంపర్కు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజవీర్ మాట్లాడుతూ.. పాలకుల నిర్లక్ష్యం మూలంగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వాటిని పరిష్కరించేందుకు బీజేపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విజయ్‌కుమార్, విజేందర్‌రావు, పూర్ణాచారి, భద్రయ్య, భిక్షపతి, సోమరాజు, పురుషోత్తం, రవి, భాస్కరాచారి, సదారాణి, నరేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయరామరావు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో విఘ్నేష్ ప్రతిభ



విఘ్నేష్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

కమలాపూర్ : తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కమలాపూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి విఘ్నేష్ ప్రతిభ కనబర్చి తృతీయస్థానంలో నిలిచినట్లు పాఠశాల హెచ్‌ఎం ఎస్సీ రంగనాథ్ తెలిపారు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ అండర్-16 బాలుర విభాగం లాంగ్‌జంప్‌లో విఘ్నేష్ 4.12 మీటర్ల ప్రదర్శనతో మూడవస్థానంలో నిలిచి బ్రాన్జ్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. విఘ్నేష్‌ను హెచ్‌ఎంతో పాటు ఫిజికల్ డైరెక్టర్ వనజ, ఉపాధ్యాయులు అభినందించారు.

సబ్‌సెంటర్ ఆవరణలో మందు, విందు

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్ మందుబాబులకు అడ్డాగా మారుతోంది. సబ్‌సెంటర్ ఆవరణ చెత్తాచెదారంతో నిండి పోవడంతో సాయంత్రం సబ్ సెంటర్ మూసిన అనంతరం మందుబాబులు మద్యం సేవించేందుకు సిట్టింగ్‌లు చేస్తున్నారు. మద్యం సేవించి అక్కడే ఖాళీ సీసాలు, డిస్పో గ్లాసులు పడేసి వెళ్తుండడంతో అక్కడికి వచ్చిన రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సిబ్బంది స్పందించి పరిసరాలను శుభ్రం చేయించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మందుబాబులు పడేసిన ఖాళీ మద్యం సీసాలు



సబ్ సెంటర్ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం, కంకర కుప్పలు

తెలుగు విభాగం ఇన్‌చార్జ్‌గా బాధ్యతల స్వీకరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం ఇన్‌చార్జ్ అధిపతిగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మామిడి లింగయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, అధ్యాపకులు కర్రె సదాశివ్, కరుణాకర్, ఫిరోజ్, శ్రీధర్ పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- ఎంపీడీఓ అనిల్‌కుమార్



టీచింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

ధర్మసాగర్ : విద్యార్థులు, యువత అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలని ఎంపీడీఓ అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డాక్టర్ అబ్దుల్ కలాం టీచింగ్, లెర్నింగ్ సెంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ముందుగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం మండల విద్యాధికారి డాక్టర్ రాంధన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హాజరై మాట్లాడారు. ప్రస్తుతం మనం 21వ శతాబ్దంలో ఉన్నామని, అన్ని రంగాల్లో విపరీతమైన పోటీ ఉందన్నారు. విద్యార్థులు, యువత ఉన్నతంగా ఎదిగేందుకు ప్రభుత్వం, సమాజం అవకాశాలు కల్పిస్తుందని వాటిని అందిపుచ్చుకోవాలని అన్నారు. చెడు మార్గాలకు దూరంగా ఉండాలని అన్నారు. చదువుపై దృష్టి సారించి, తల్లిదండ్రుల, పాఠశాల పేరు నిలబెట్టాలన్నారు. అనంతరం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి హాజరైన పదో తరగతి విద్యార్థులకు త్వరలో జరుగనున్న పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విషయ నిపుణులు ఉమాదేవి, ఫ్రాన్సిస్, ధర్మప్రకాశ్, గిరిధరాచార్యులు, వేణుగోపాల్, శ్వేత, నవీన్ కుమార్ పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజేందర్, మురళి, శ్రీనివాస్, గైడ్ టీచర్లు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు



ఇసుక లారీని సీజ్ చేసి నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ సంతోశ్

ఆత్మకూరు : ఇసుక అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ సంతోశ్ హెచ్చరించారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. ఆత్మకూరు సమీపంలోని దర్గా వద్ద గురువారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆత్మకూరు నుంచి ములుగు రోడ్డు వైపు వెళ్తున్న లారీని, ఎస్కార్ట్‌గా వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేసినట్లు తెలిపారు. దీంతో లారీలో ఇసుక రవాణా జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. దానికి సంబంధించిన ఎలాంటి అనుమతులు లేవని అన్నారు. లారీ డ్రైవర్ వేల్పుల సంతోశ్‌ను ఆరా తీయగా పరకాల వాగు నుంచి ఇసుకను దొంగిలించి గుట్టుచప్పుడు కాకుండా ఆత్మకూరు నుంచి దుగ్గొండి మీదుగా గీసుగొండకు తరలిస్తున్నట్లు తెలిపారు. లారీలలో రూ.33,600 విలువచేసే 28 టన్నుల ఇసుక ఉందని సీఐ తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న లారీని, సంబంధించిన కారును సీజ్ చేసినట్లు చెప్పారు. అలాగే లారీ డ్రైవర్ వేల్పుల సంతోశం, కారు డ్రైవర్ పోలవేణి రమేశ్, లారీ ఓనర్ శ్రీనివాసరావు అలాగే కారులో ప్రయాణిస్తున్న లింగారావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. సీఐ వెంట ఎస్సై తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

మహాశివరాత్రిని వైభవంగా నిర్వహించాలి

- ఈఓ నాగేశ్వరరావు

వేలేరు : మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించాలని మల్లికుదుర్ల శివారులో గల పుణ్యక్షేత్రమైన గట్టు మల్లికార్జున స్వామి ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు అన్నారు. గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి జాతర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26వ తేదీన మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం రుద్రహోమం, సాయంత్రం శివకల్యాణం, రాత్రి పెద్దపట్నం వేయనున్నట్లు తెలిపారు. శివరాత్రి నుంచి ఉగాది వరకు జాతర ఘనంగా జరుగుతుందని తెలిపారు. మండలంతో పాటు వివిధ ప్రాంతాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కించగా హుండీల ద్వారా రూ.97,553, ఆర్జిత సేవల ద్వారా రూ.4,44,273 వచ్చినట్లు వెల్లడించారు. ఏఎస్సై కిషన్, దేవదాయ ధర్మదాయ శాఖ డివిజన్ పరిశీలకుడు అనిల్‌కుమార్, ఆలయ అర్చకుడు మహేశ్ పాల్గొన్నారు.



జాతర వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఈఓ నాగేశ్వరరావు, అధికారులు

చికెన్ సెంటర్ల నిర్వాహకులు శుభ్రత పాటించాలి



చికెన్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

వేలేరు : మండలంలోని చికెన్ సెంటర్ల నిర్వాహకులు శుభ్రత పాటించాలని పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు చికెన్ షాపులను, ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లను తనిఖీ చేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చికెన్ సెంటర్‌లను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని, చికెన్‌పై ఈగలు వాలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. చికెన్ వ్యర్థాలను డంపింగ్ యార్డుల్లోనే వేయాలని అన్నారు. అలాగే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకులు కల్తీ నూనెలు వాడకూడదని, నాణ్యమైన పదార్థాలనే విక్రయించాలని సూచించారు. దుర్వాసన వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

శాయంపేట : అసెంబ్లీ ఎన్నికల ముందు ఉద్యమకారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వరంగల్ ఉమ్మడి కోకన్వీనర్ పోడిశెట్టి గణేశ్ కోరారు. గురువారం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేఖ రాసి మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్‌లో గల పోస్ట్‌బాక్స్‌లో సీఎంకు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఉద్యమకారుడికి 250గజాల ఇంటి స్థలం, ప్రతినెల రూ. 25వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు బలిజె నర్సింహారాములు, శ్రీనివాస్‌రెడ్డి, సారయ్య, సురేశ్, శివ, రఫీ, రాజు, రామకృష్ణ, శంకర్, నాగరాజు, రమేశ్, సాంబమూర్తి, డేవిడ్ రాజ్, అశోక్, ప్రభాకర్, మహేందర్ పాల్గొన్నారు.



సీఎంకు లెటర్ పోస్ట్ చేస్తున్న ఉద్యమకారులు

తండ్రి కోసం కూతురి ప్రచారం

కమలాపూర్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేస్తున్న తన తండ్రి అంజిరెడ్డిని గెలిపించాలని ఆయన కూతురు సుచిత్రారెడ్డి మండలంలో గురువారం ప్రచారం నిర్వహించారు. స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పట్టభద్రుల వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అలాగే భీంపల్లిలో పట్టభద్రుల ఓటరు ఎలిగం రాజు కూతురు భార్గవి ఇటీవల ప్రమాదానికి గురి కాగా ఆమెను పరామర్శించారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శోభన్, మహాజన్ పాల్గొన్నారు.



పట్టభద్రులతో మాట్లాడుతున్న సుచిత్రారెడ్డి